Andhra Jyothy                    Dt- 22/09/17.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద ఒలిఫెంటా రైల్వే వంతెనపై నిర్మిస్తున్న మెట్రో స్టీల్ బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్, మెట్రో అధికారులు.

# నవంబరు 20కి మన రైలెక్కొచ్చు

## ప్రధాని తేదీ ఖరారైతే ప్రారంభమే

- మెట్రోను కావాలనే ఆపాం!
- 8 కిలోమీటర్లు ఎప్పుడో సిద్ధమైంది
- రెండేళ్ల కిందే ప్రారంభించే వాళ్లం
- 30 కిలోమీటర్లతో మొదలుపెడితే ఎక్కువమంది ప్రజలకు ప్రయోజనం
- ఇతర మెట్రోలు 7-12 కిలోమీటర్లే
- మున్సిపల్ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు
- మెట్రో స్టీల్ బ్రిడ్జి పనుల పరిశీలన

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో పనులు అక్టోబరు 15కల్లా పూర్తి చేసి, నవంబరు 20వ తేదీకల్లా రైళ్లు నడవడానికి సిద్ధంగా ఉంచుతామని మున్సిపల్ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. ప్రధాని కార్యాలయం నుంచి ప్రారంభోత్సవ తేదీ ఖరారు కావడమే మిగిలిందని తెలిపారు. గురువారం ఆయన సికింద్రాబాద్ ఒలిఫెంటా రైల్వే బ్రిడ్జి వద్ద నిర్మిస్తున్న మెట్రో స్టీల్ బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎనిమిది కిలోమీటర్ల పొడవున నాగోల్- మెట్టుగూడ మార్గం రెండేళ్ల క్రితమే పూర్తయిందని, మియాపూర్-ఎస్సార్ నగర్ 11 కిలోమీటర్లు గత ఏడాదే పూర్తయిందని

మిగతా 15వ పేజీలో...

# నవంబరు 20కి మన రైలెక్కొచ్చు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. వీటిని ప్రారంభించడం వల్ల ప్రజలకు పెద్దగా ప్రయోజనం ఉండదని భావించి ఇప్పటిదాకా ఆగామన్నారు. ప్రస్తుతం మియాపూర్ నుంచి అమీర్‌పేట మీదుగా నాగోల్ వరకు 30 కిలోమీటర్ల దూరంతో నగరానికి ఒక చివర నుంచి మరో చివరికి మెట్రోతో అనుసంధానం అవుతుండడంతో ఈ మార్గాన్ని మొదటి దశలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. దేశంలో ఇప్పటి వరకు ప్రారంభమైన బెంగళూరు, కొచ్చిన్, లక్నో మెట్రోలు కేవలం 7,11,12 కిలోమీటర్ల దూరంతో కూడుకున్నవేనని చెప్పారు. 30 కిలోమీటర్ల దూరం అంటే ప్రాజెక్టులో 42 శాతంగా చెప్పవచ్చని, నగరంలో ఒక చివరి నుంచి మరో చివరవరకు మెట్రో ప్రయాణం అందుబాటులోకి వస్తుందని అన్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జేబీఎస్, అమీర్‌పేట, బేగంపేట వంటి కీలక ప్రాంతాలను కలిపే అవకాశం ఉండడంతో ప్రాజెక్టు వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని చెప్పారు.

అందుకే ఆలస్యమైనా ఎక్కువ దూరం అందుబాటులోకి తెచ్చిన తర్వాతే ప్రారంభిస్తున్నామని కేటీఆర్ వివరించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ మెట్రో స్టేషన్‌లోని సౌకర్యాలను, టికెట్లను జారీచేసే యంత్రాలను మెట్రో రైలు ఎండీఎన్వీఎస్ రెడ్డి, ఎల్ అండ్‌టీ మెట్రో రైల్ ఎం.డి.శివానంద్ నింబర్గీ, మేయర్ బొంతు రాంమోహన్, ఎంఎయూడీ సెక్రెటరీ నవీన్ మిట్టల్‌లతో కలిసి ప్రత్యేకంగా పరిశీలించారు.

### మెట్రోపై యాప్

మెట్రో సమగ్ర సమాచారంతో స్మార్ట్ యాప్‌ను త్వరలో అందుబాటులోకి తెస్తామని, ఎక్కడికి ఎలా వెళ్లాలి? ఎంత చార్జి అవుతుంది? వంటి విషయాలను దీనిద్వారా తెలుసుకోవచ్చని మంత్రి కేటీఆర్ చెప్పారు. భారతీయ రైల్వేల చరిత్రలో మొట్టమొదటిసారిగా 14 రైల్వే ట్రాక్‌లపై బ్రిడ్జి నిర్మించడం చాలా అరుదని అన్నారు. మెట్రో స్టీల్ బ్రిడ్జి నిర్మాణం ఒక ఇంజనీరింగ్ అద్భుతంగా చెప్పొచ్చని వ్యాఖ్యానించారు.

### ప్రతి మెట్రో స్టేషన్ ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జ్

నగరంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లను మెట్రో కోసం పూర్తిగా తొలగించాల్సి వచ్చింది. వాటి స్థానంలో ప్రతి కిలోమీటరుకు ఒక మెట్రో స్టేషన్ నిర్మాణమవుతోంది. ఈ మెట్రో స్టేషన్‌లో రెండు వైపులా ఎక్కేందుకు, దిగేందుకు అవకాశం ఉంది. నగర వాసులు ఎవరైనా రోడ్డు దాటేందుకు మెట్రోస్టేషన్‌లను ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లుగా వాడుకొనేలా తీర్చిదిద్దుతున్నామని కేటీఆర్ చెప్పారు. ప్రతి మెట్రోస్టేషన్‌లో పబ్లిక్ స్పేస్‌ను మొదటి అంతస్థులో ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడే షాపింగ్ చేసుకునేలా వ్యాపార సంస్థలు ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. ఇవన్నీ ప్రయాణికులకు, నగరవాసులకు సౌకర్యవంతంగా ఉండేలా తీర్చిదిద్దుతామని చెప్పారు. మెట్రో స్టేషన్‌ల దగ్గర బాటిల్‌నెక్ సమస్యను పరిష్కరించేందుకు స్కైవేలను ప్లాన్ చేస్తున్నామని, ఇవన్నీ మెట్రో ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

### ఏడాది తర్వాతే పూర్తి స్థాయిలో పార్కింగ్

మొత్తం 66 మెట్రో స్టేషన్‌లలో 34 స్టేషన్‌లకు పార్కింగ్ స్థలాలను గుర్తించారు. మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్సుల నిర్మాణం మరో ఏడాది తర్వాతే పూర్తవుతుందని మంత్రి కేటీఆర్ చెప్పారు. మెట్రో ప్రారంభం నాటికి విద్యుత్‌తో నడిచే మినీ బస్సు సర్వీసులను అందుబాటులోకి తెస్తామన్నారు. ఓలా, ఉబర్ వంటి ప్రైవేటు సంస్థలతో కలిసి ప్రయాణికులు గమ్యస్థానాలకు సులభంగా చేరుకునే ఏర్పాట్లు చేస్తామన్నారు.

### రెండు మెట్రో స్టేషన్‌ల మధ్య స్కైవే

సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్‌తో పశ్చిమాన పాత గాంధీ ఆస్పత్రిలో నిర్మాణంలో ఉన్న సికింద్రాబాద్ వెస్ట్ మెట్రో స్టేషన్‌తో స్కైవే ద్వారా అనుసంధానం చేస్తామన్నారు. ఈ రెండింటి మధ్యలో ఉన్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వీటితో అనుసంధానం అవుతుందని వివరించారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే రైల్వే ప్రయాణికులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి నేరుగా స్కైవే ద్వారా మెట్రో స్టేషన్‌లకు వెళ్లవచ్చని, సమయం, డబ్బు ఆదా అవుతాయని తెలిపారు.